మక్కల కొనుగోళ్లు ఎప్పుడో?

మొక్కజొన్న పంట సాగుచేసిన రైతులు మక్కలు అమ్ముకునేందుకు తిప్పలు పడుతున్నారు. అకాల వర్షాలు, వడగండ్ల వానలతో ఉక్కిరిబిక్కిరి అయిన అన్నదాతలు చేతికందిన పంటను కల్లాల వద్దే పేర్చి కొనుగోలు కేంద్రాల కోసం ఎదురుచూస్తున్నారు. పంటలు పండించిన కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచారంగా మారింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కేంద్రాలు ఏర్పాటుచేసి ఇబ్బందులు తొలగించాలని వేడుకుంటున్నారు.

- మొత్తుకుంటున్న మొక్కజొన్న రైతులు
- ఓదెల మండలంలో 2,800 ఎకరాల్లో మొక్కజొన్న సాగు
- కల్లాలవద్దే అమ్ముతున్న రైతులు
- వడగండ్ల వర్షాలకు దెబ్బతిన్న పంటలు
- గిట్టుబాటు ధరలేక రైతుల ఆవేదన


కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న

ఓదెల: మండలంలోని ఓదెల, గుంపుల, గూడెం, పొత్కపల్లి, మడక, కొమిర గ్రామాల్లో మొక్కజొన్న పంటను ఎక్కువగా సాగుచేశారు. ఇటీవల కురిసిన వడగండ్ల వర్షాలతో మొక్కజొన్న పంట పూర్తిగా నేలవాలి పంటనష్టం వాటిల్లింది. ప్రకృతి వైపరీత్యాలతో మరోవైపు మొక్కజొన్న పంట సేద్యానికి పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోవడంతో ఆయా గ్రామాల్లోనే దళారులకు ధాన్యం అమ్ముకునే పరిస్థితి దాపురించిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు రైతుల ఇబ్బందులు కళ్లారాచూసిన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. దీంతో రైతులు మొక్కజొన్న పంటను కల్లాల వద్దే ఆరబెట్టి అమ్ముకుంటున్నారు.


కల్లాలవద్ద తూకం వేస్తున్న రైతులు

ధాన్యం దళారుల పాలు..

ఆయా గ్రామాల్లోని రైతులు కల్లాలవద్దనే దళారులకు క్వింటాలుకు రూ.2వేల లోపు విక్రయిస్తున్నట్లు సమాచారం. అయినప్పటికీ పూర్తిస్థాయిలో రైతులకు ఒకేసారి డబ్బులు ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి. వర్షాలకు దెబ్బతిన్న పంటల సర్వేతో పాటు పరిహారం ఇప్పట్లో అందని పరిస్థితి ఉందని రైతులు బావిస్తున్నారు. మరోవైపు పెట్టిన పెట్టుబడి రాకపోవడం, అమ్మిన ధాన్యంకు దళారుల నుంచి ఒకేసారి డబ్బులు ఇవ్వకపోవడం వంటి సమస్యలు రైతులను వేధిస్తున్నాయి. ప్రభుత్వం అందుబాటులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.


కల్లంవద్ద కంకులు పడుతున్న రైతులు

కల్లం వద్దనే అమ్మిన



మొక్కజొన్న ఎండబోసి పట్టిన కల్లం వద్దనే క్వింటాలుకు రూ.1950 చొప్పున అమ్మిన. ఎకరం పంటసాగు చేస్తే వర్షంతో పూర్తిగా నేలవాలి నష్టం జరిగింది. ఉన్నదాన్ని కోసి ఆరబెట్టి స్థానిక వ్యాపారికి అమ్మేశాను. వర్షాలతో పంట నష్టపోయాను.

– దొమ్మటి చంద్రయ్య, రైతు, ఓదెల

పెగడపల్లికి తీసుకెళ్లి అమ్మిన



రెండెకరాల్లో సాగుచేసిన మక్కలను పక్కఊరు పెగడపల్లికి తీసుకువెళ్లి అమ్మేశాను. స్థానికంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాలతో పడరాని పాట్లు పడ్డ అమ్మేందుకు అరిగోస పడుతున్న.

– బీసు శ్యాంకుమార్, రైతు, నాంసానిపల్లె

కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి. లేకపోతే దళారుల చేతికి పంటలు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

– జంగ తిరుపతిరెడ్డి, రైతు, కొలనూర్

క్లుప్తంగా

సచివాలయానికి అంబేద్కర్ పేరు చిరస్థాయిగా నిలుస్తుంది


క్షీరాభిషేకం చేస్తున్న లింగమూర్తి

సుల్తానాబాద్: సచివాలయానికి అంబేద్కర్ పేరు చిరస్థాయిగా నిలుస్తుందని దళిత ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు లింగమూర్తి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సచివాలయానికి అంబేడ్కర్ పేరుపెట్టడంతో పాటు దేశంలో ఎక్కడలేని విధంగా 125 అడుగుల విగ్రహాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. వైస్‌ప్రెసిడెంట్ రాజయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోచమ్మ కొలుపు ఉత్సవ నిర్వహణకు విరాళం


విరాళం అందిస్తున్న ప్రేమలత

కమాన్‌పూర్: గ్రామపంచాయతీలో నిర్వహించే బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ, పోచమ్మ కొలుపు ఉత్సవ నిర్వహణకు మాజీ ఎంపీపీ, ఆదివరహస్వామి ఆలయ చైర్మన్ ఇనగంటి ప్రేమలత, జగన్నాథరావు, ఇనగంటి రామారావు గురువారం కమిటీ సభ్యులకు రూ.51, 116లను విరాళంగా అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కిషన్‌రెడ్డి, మల్యాల రాంచంద్రంగౌడ్, నీలం శ్రీనివాస్, గడప కృష్ణమూర్తి, నల్లవెల్లి శంకర్, బోనాల మల్లయ్య, పొన్నం నవీన్‌పటేల్, సాన సురేశ్ తదితరులు ఎ

హర్షితకు అభినందన


ప్రశంసా పత్రం అందుకుంటున్న హర్షిత, సంపత్

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం చందనపూర్ ప్రభుత్వ పాఠశాల చెందిన విద్యార్థిని హర్షితకు గురువారం రాష్ట్రపతి భవన్‌లో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ డాక్టర్ విపిన్ కుమార్ ప్రశంసాప్రతం అందించారు. నాలుగు రోజులుగా రాష్ట్రపతి భవన్ న్యూఢిల్లీలో నిర్వహించిన ఫైన్ కార్యక్రమంలో చందనపూర్ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి దాసరి హర్షిత రూపొందించిన కామన్ మ్యాన్ ఫ్రెండ్లీ హెల్మెట్ అనే ప్రాజెక్టును ప్రదర్శించింది. వెల్డర్లకు దుమ్ము ధూళి ప్రాంతాల్లో పనిచేసే కార్మికులకు ఈ హెల్మెంట్ ఎంతో ఉపయోగపడతుందని వివరించింది. హర్షితతో పాటు గైడ్‌టీచర్ సంపత్ కుమార్‌ను డాక్టర్ విపిన్‌కుమార్ అభినందించి ప్రశంస పత్రాలు అందించారు.

అప్రమత్తతోనే అగ్ని ప్రమాదాల నివారణ


అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

జ్యోతినగర్: అప్రమత్తతోనే అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని పెద్దపల్లి అగ్నిమాపక అధికారి దేవనంది శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరీ ఆసుపత్రిలో తనిఖీలు చేపట్టి మాట్లాడారు. అగ్ని ప్రమాదాల నియంత్రణపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, జిల్లావ్యాప్తంగా అగ్ని ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తు తనిఖీలు చేపడుతున్నామన్నారు. పెద్దపల్లి ఫైర్‌స్టేషన్ పరిధిలో అగ్ని ప్రమాదాల నియంత్రణకు పలు ఆసుపత్రులు, పాఠశాలలు, ముఖ్యమైన వాణిజ్య సంస్థల్లో తనిఖీలు చేసి అగ్నిప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించామన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లిస్టేషన్ సిబ్బంది సిరాజొద్దీన్, శ్రీనివాస్, శ్రవణ్ కుమార్, నరేందర్, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు నిధుల సేకరణ

రామగుండం: కార్మికవర్గానికి అండగా సామాజిక ఉద్యమాలను మరింత విస్తృతం చేసేందుకు సీఐటీయూ కార్మికుల నుంచి నిధుల సేకరణ చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం స్థానిక కుందనపల్లి శివారులోని ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్ ఇంధన డిపోల ప్రాంగణంలో ఒక్కో కార్మికుడిని కలిసి ఆర్థికసాయం స్వీకరించారు. కార్మికవర్గాన్ని అణగదొక్కుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎప్పటికప్పుడు ఎండగడుతుంటామని, దళితులు, గిరిజనులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించేలా సంఘాలకు అండగా నిలవాలని, కార్మికవర్గ ఐక్యత చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, తుంగపిండి మల్లేశ్, మార్త పోశం తదితరులున్నారు.

కాంగ్రెస్‌కు అండగా ముస్లింలు

సుల్తానాబాద్: కాంగ్రెస్‌కు అండగా నిలవాల్సిన బాధ్యత ముస్లింలపై ఉందని మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయ రమణారావు అన్నారు. గురువారం రాత్రి సుల్తానాబాద్ పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ఇఫ్తార్‌విందు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాజీ విజయరమణారావుతో పాటు ఆయన సతీమణి పావని ఇఫ్తార్ విందుకు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే ముస్లింలకు న్యాయం జరిగిందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు భవిష్యత్ ఉందని, ముస్లింలు కాంగ్రెస్ వెంట ఉండాలని పిలుపునిచ్చారు. దర్గాలకు, ఖబరస్తాన్ మరమ్మతులకు నిధులందించి అభివృద్ధికి తోడ్పడతామన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, సత్యనారాయణరెడ్డి, అంతటి పుష్పాలత, అన్నయ్యగౌడ్, గోపగాని సారయ్య,ప్రకాశ్‌రావు, దామోదర్‌రావు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో విజయ రమణారావు

కాల్వశ్రీరాంపూర్: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, సర్పంచు ఆడెపు శ్రీదేవి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ రాజకొమురయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ జిన్న రాంచంద్రారెడ్డి, నాయకులు, ముస్లింలు, మహిళలు పాల్గొన్నారు.

శ్రీపాదరావుకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న కాలనీ కాంగ్రెస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ/రామగుండం/సుల్తానాబాద్/జూలపల్లి/కమాన్‌పూర్/పాలకుర్తి: పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో గురువారం శ్రీపాదరావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు శ్రీపాదరావు చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కమాన్‌పూర్ మండలకేంద్రంలో శ్రీపాదరావు వర్ధంతి సభకు బైక్‌లపై ర్యాలీగా వెళ్లారు.

దళితరత్న అవార్డు గ్రహీతకు సన్మానం

జ్యోతినగర్: పెద్దపల్లి జిల్లా నుంచి ఎన్టీపీసీ విశ్రాంత ఉద్యోగి సట్టు ముత్యాలు దళితరత్న అవార్డుకు ఎంపికవడంపై ఐఎన్‌టీయూసీ కార్యదర్శి బండారి కనకయ్య, నేతకాని మహర్‌సంఘం స్టీరింగ్‌కమిటీ చైర్మన్ దుర్గం నర్సయ్య హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా గురువారం ఎన్టీపీసీ పీటీఎస్‌లోని హాలులో డాక్టర్ అంబేడ్కర్, బాబుజగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాల సందర్భంగా ముత్యాలుకు ఆత్మీయ సన్మానసభ నిర్వహించి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలిపాక సుజాత, సమతా సైనిక దళ్ నాయకులు దుర్గం నగేశ్, దూట రాజు, పంజా నర్సయ్య, సుదర్శన్, సురేందర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, శ్రీపతిరావు, సత్యనారాయణ, దేవ లచ్చయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.


ముత్యాలును సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం

గోదావరిఖనిటౌన్: సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ ఎస్సీమోర్చా ఆధ్వర్యంలో గురువారం గోదావరిఖని పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాష పిలుపుతో గురువారం రామగుండం నియోజకవర్గ ఎస్సీమోర్చా నాయకుడు అడ్డూరి రాజేశ్ ఆధ్వర్యంలో స్థానిక శిశుమందిర్ పాఠశాల నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహాలను శుద్ధిచేస్తూ బైక్‌ర్యాలీ తీశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి కాశిపేట శివాజీ, నాయకులు మల్లికార్జున్, పిడుగు కృష్ణ, సోమారపు అరుణ్ కుమార్, ఖ్యాతం వెంకటరమణ, జక్కుల నరహరి, దుబాసి లలితమల్లేష్, మాతంగి రేణుక తదితరులు పాల్గొన్నారు.


క్షీరాభిషేకం చేస్తున్న మోర్చా నాయకులు

పునరావాస ప్యాకేజీ అమలు చేయాలి

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితులకు సత్వరమే పునరావాస ప్యాకేజీ అమలు చేయాలని కోరుతూ గురువారం ముర్మూర్ సర్పంచ్ స్వామి పలుఅంశాలతో కూడిన వినతిపత్రాన్ని పెద్దపల్లి ఆర్డీవో వెంటక మాధవరావుకు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వామి మాట్లాడుతూ.. నిర్వాసిత కాలనీల్లో పలు సమస్యలున్నాయని వాటి పరిష్కారానికి ప్రత్యేక నిధి కేటాయించాలని కోరారు. ఇప్పటికే ముంపు గ్రామాలైన ఎల్లంపల్లి, ముర్మూర్, పొట్యాల, మద్దిర్యాల గ్రామాల వారీగా 18 ఏళ్లు నిండిన వారి జాబితా సిద్ధం చేసినప్పటికీ తరచూ సర్వేలు చేయడంతో బోగస్ దరఖాస్తులు పుట్టుకొస్తున్నాయన్నారు. తొలిసారి సిద్ధంచేసిన జాబితా ప్రకారం సత్వరమే పునరావాస ప్యాకేజీ పరిహారం అందించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఉపసర్పంచ్ రాకేశ్, వార్డు సభ్యుడు కొదురుపాక దేవేందర్ తదితరులున్నారు.


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ స్వామి

సీసీ కెమెరాలతో గ్రామాల్లో ప్రశాంతత

ఓదెల: సీసీ కెమెరాలతో గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని పొత్కపల్లి ఎస్సై మహేందర్ పేర్కొన్నారు. గురువారం ఓదెల మండలం ఉప్పరపల్లె, గుంపుల గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. గ్రామాల్లో నేరాలు తగ్గుముఖం పట్టడానికి సీసీ కెమెరాలు దోహదం చేస్తున్నాయన్నారు. నేరాల నియంత్రణకు గ్రామస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని 22 గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు పల్లె ఓదెలు, తిప్పారపు చిరంజీవి, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితురాలికి చేయూత

కమాన్‌పూర్: పాలకుర్తి మండలం కన్నాల గ్రామానికి చెందిన గసిగంటి రాజేశ్వరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా వైద్యం అందించడానికి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు సేకరించిన రూ.59వేల నగదును గురువారం కమాన్‌పూర్ ఎస్సై షేక్‌మస్తాన్ ఆధ్వర్యంలో రాజేశ్వరి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, హెల్పింగ్‌హ్యాండ్స్ అధ్యక్షుడు నారగోని సతీశ్, మేడగోని విజయ్, సాయి, మల్యాల విజయ్, రెడ్డి చైతన్య, మల్యాల నరేశ్, మిడివెల్లి రఘు, గడ్డం ప్రకాశ్, ఆవునూరి శ్యాం పాల్గొన్నారు.

ముగిసిన ఎల్లమ్మ తల్లి బోనాల జాతర

రామగుండం: అంతర్గాం మండలపరిధిలోని పెద్దంపేట గ్రామంలో గౌడకులస్తుల ఆరాధ్యదైవమైన ఎల్లమ్మ తల్లి బోనాల జాతర గురువారంతో ముగిసింది. మూడు రోజులుగా కొనసాగిన జాతరకు మండలపరిధిలోని వివిధ గ్రామాల నుంచి వేలాదిగా గౌడ కులస్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి గౌడకుల గీత కార్మికులు మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకలకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఠాకూర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు సోమారపు అరుణ్‌కుమార్–లావణ్య దంపతులు హాజరయ్యారు.

ఘనంగా పోచమ్మ బోనాల ఉత్సవాలు

ధర్మారం: మండలకేంద్రంలోని బీరయ్య ఎదురు పట్నాల ఉత్సవాల్లో భాగంగా గురువారం గ్రామ దేవత పోచమ్మకు మహిళలు బోనాలు సమర్పించారు. గ్రామంలోని యాదవసంఘం మహిళలు ఇంటికో బోనంతో పోచమ్మ ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో యాదవసంఘం సొసైటీ చైర్మన్ జంగమహేందర్ యాదవ్, యాదవ సంఘం అధ్యక్షుడు తుమ్మల కొమురయ్య, ఉపసర్పంచ్ ఆవుల లత, సంఘం యూత్ అధ్యక్షుడు సులిగే శేఖర్, ఉపాధ్యక్షుడు అనిల్ తదితరులు పాల్గొన్నారు.


బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

కార్యకర్తల్లో మనోధైర్యం కల్పించేందుకే ఆత్మీయసమ్మేళనం

ఓదెల: గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తల్లో మనోధైర్యం కల్పించేందుకే ఆత్మీయ సమ్మేళనాలు దోహదపడతాయని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఓదెల మండలం గుండ్లపల్లె, కనగర్తి గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కనగర్తి, గుండ్లపల్లె గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన కళ్యాణలక్ష్మి చెక్కులను ఓదెల ఎంపీపీ కునారపు రేణుకదేవి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఓదెల ఎంపీపీ కునారపు రేణుకదేవి, రైతుసమన్వయ సమితి మండల అధ్యక్షుడు కావటి రాజు, డైరెక్టర్ సదాశివ్, మ్యాడగొని శ్రీకాంత్‌గౌడ్, సర్పంచులు పులుగు తిరుపతిరెడ్డి, కోట దామోదర్‌రెడ్డి, మధు, ఎంపీటీసీ ఆరెల్లి సరోజన మొండయ్య, నాయకులు పొతుగంటి రాజు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రేణుక

బీజేపీ భారీ బైక్ ర్యాలీ

గోదావరిఖని: బీజేపీ ఎస్సీమోర్చా ఆధ్వర్యంలో గురువారం భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహాలను శుద్ధిచేస్తూ పూలమాల లు వేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, కాశిపేట శివాజీ, పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ మల్లికార్జున్, రామగుండం అసెంబ్లీ కన్వీనర్ పిడుగు కృష్ణ, సోమారపు అరుణ్‌కుమార్, అడ్డూరి రాజేశ్, క్యాతం వెంకటరమణ, నరహరి, దుబాసి లలిత, మాతంగి రేణుక, కొండపర్తి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



టీబీ పేషెంట్లకు పౌష్టికాహారం పంపిణీ

సుల్తానాబాద్: టీబీముక్త్ భారత్‌లో భాగంగా రాగినేడు హెల్త్‌సెంటర్‌లో 25 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు లయన్స్ క్లబ్ సభ్యులు పౌష్టికాహారం అందించారు. గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పెద్దపల్లి ఆధ్వర్యంలో 25మంది టీబీ పేషంట్లకు పౌష్టికాహారం అందించినట్లు బండ బాబురావు, శ్రావణ్‌కుమార్ తెలిపారు. దాతలు ముందుకు వచ్చి పౌష్టికాహారం అందించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కావేటి రాజగోపాల్ కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి అధ్యక్షులు రేకులపల్లి శశాంక, మట్టా రాంరెడ్డి, హెల్త్ సెంటర్ డాక్టర్ శ్రవణ్, టిబి ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్ హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.


పౌష్టికాహారం అందిస్తున్న బాబురావు

రేషన్‌షాపుల్లో 12 రకాల వస్తువులు పంపిణీ చేయాలి



పోరుయాత్రలో పాల్గొన్న లక్ష్మి

రామగుండం: ప్రభుత్వం రేషన్‌షాపుల్లో 12 రకాల వస్తువులను సబ్సిడీ ధరలపై పంపిణీ చేయాలని డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా గురువారం నుంచి ప్రగతిశీల మహిళాసంఘం (పీవోడబ్ల్యూ) ఆధ్వర్యంలో గ్రామాలవారీగా పోరుయాత్ర ప్రారంభించినట్లు రాష్ట్ర నాయకురాలు కోడిపుంజుల లక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఎగ్లాస్‌పూర్, పొట్యాల గ్రామాల్లో పోరుయాత్ర సభ నిర్వహించారు. ఈ యాత్రలో ప్రజాపంథా డివిజన్ నాయకులు తీగుట్ల రాములు, దేవేందర్, మొండయ్య, రాజయ్య, లక్ష్మి, తిరుమల, విజయ, సుజాత, యశోద, దేవేందర్ ఉన్నారు.

ఏకపక్ష నిర్ణయాలు సంఘానికి చేటు


సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

సుల్తానాబాద్: ఏకపక్ష నిర్ణయాలతో సంఘానికి చేటుచేస్తుందని కుర్మసంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం, జిల్లా ప్రధానకార్యదర్శి కర్రె కుమారస్వామి అన్నారు. గురువారం జీకేఎస్ఎస్ రెండో విడత గొర్రెల పంపిణీ పథకం అవగాహన సదస్సుపై తమతో ఎలాంటి సంప్రదింపులు లేకుండా ఏకపక్ష నిర్ణయాలతో యాదవులు వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. గొల్లకురుమలు అంతా ఒక్కటని చెబుతూ కురుమలను విస్మరించడం సరికాదన్నారు. తమకు సమాచారం ఇవ్వకుండా సదస్సు ఏర్పాటు చేసి తమను భాగస్వామ్యులను చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర, జిల్లా నాయకులు గుడిగే సదయ్య, కచ్చు బీరయ్య, కుంట కుమారస్వామి, కుంట హనుమయ్య, రాజకొమురయ్య, గోపు సతీశ్, కడారి అంజయ్య, పెద్ది తిరుపతి పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. సచివాలయానికి అంబేద్కర్ నామకరణం చేసి హైదరాబాద్‌లో 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న సందర్భంగా గురువారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక తిలక్‌నగర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ రమేశ్‌నగర్, కళ్యాణనగర్, లక్ష్మీనగర్, ప్రధాన చౌరస్తా మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు సాగింది. కార్యక్రమంలో నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సమాఖ్య కార్యవర్గం ఎన్నిక


మాట్లాడుతున్న సమాఖ్య ప్రతినిధులు

కోల్‌సిటీ: రామగుండం పట్టణ సమాఖ్య, ధనశ్రీ పట్టణ సమాఖ్యల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు నిర్వహించే ఎన్నికల ప్రక్రియలో భాగంగా అర్హులైన ఓటర్ల జాబితా తయారు చేసి గురువారం నుంచి కార్యాలయంలో ప్రదర్శిస్తున్నట్లు పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కుమార్ దీపక్ తెలిపారు. రామగుండం పట్టణ సమాఖ్యలో 53 స్లమ్‌లు, ధనశ్రీ పట్టణ సమాఖ్యలో 43 స్లమ్ సమాఖ్యలు ఉన్నాయన్నారు. నిబంధనల ప్రకారం తమ సమాఖ్య వార్షిక రిటర్నులను జిల్లా సహకార కార్యాలయంలో సమర్పించి అర్హత పొందినందున వారిని ఓటర్లుగా గుర్తించి జాబితా రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ జాబితాపై ఇతర స్లమ్ సమాఖ్యలకు అభ్యంతరాలున్నట్లయితే ఈనెల 18వ తేదీ లోగా నగరపాలక సంస్థ కార్యాలయంలోని మెప్మా విభాగంలో లిఖిత పూర్వకంగా సమర్పించాలని ఆయన కోరారు.